ప్రజాశక్తి

శనివారం 25 మే 2024 5 అనంతపురం

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు

52 శాతం గైర్హాజరు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నాడు ప్రారంభం అయ్యాయి. అనంతపురం జిల్లాలో 45 సెంటర్లలో పరీక్షలు జరిగాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు 5423 మంది హాజరు కావాల్సి ఉండగా 2847 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల విభాగం ఏసీ గోవింద నాయక్ తెలిపారు. 2576 మంది మాత్రమే పరీక్ష రాసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తనిఖీ చేశారు. పదవ తరగతి సిలబస్ వచ్చే విద్యాసంవత్సరం నుంచి పూర్తిగా మారుతున్న నేపథ్యంలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్యాలు వారి పరిధిలోని పది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని డిఇఒ కోరారు.

వేరుశనగ విత్తన పంపిణీ మొదలు

- ◆ 40,704 మంది రైతుల రిజిస్ట్రేషన్
- ◆ ఇప్పటికి సగంలోపే నిలువలు
- ◆ ఈసారైనా లోపాలకు చెక్‌పెట్టేరా ?

గుమ్మఘట్టలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, జెడిఎ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో వేరుశనగ విత్తనకాయల పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ శుక్రవారం నాడు గుమ్మగట్ట మండలంలో విత్తన పంపిణీని ప్రారంభించారు. విత్తనకాయల పంపిణీకి ఆశించినంత స్పందన కనిపించడం లేదు. గతేడాది వర్షాభావ పరిస్థితులు, ఈ ఏడాది విత్తనం కొనుగోలుకు డబ్బుల్లేకపోవడం వంటి వాటితో రైతులు వేరుశనగ సాగుపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది 76 వేల క్వింటాళ్లు వేరుశనగ విత్తన పంపిణీ చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈనెల 18వ తేది నుంచి విత్తనం అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకుని నాన్ సబ్సిడీ మొత్తాన్ని రైతు భరోసా కేంద్రాల్లో చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం గ్రామాల వారీగా విత్తనకాయలను రైతులకు అందజేయనున్నారు. ఇప్పటి వరకు చూస్తే జిల్లాలో 40,704 మంది రైతులు మాత్రమే విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనంతపురం జిల్లా వరకే చూస్తే దాదాపు రెండు లక్షల మంది వరకు రైతులున్నారు. ఇప్పటి వరకు జరిగిన విత్తన రిజిస్ట్రేషన్లు 40,704 మాత్రమే.

ఆలస్యంగా విత్తన సేకరణ

విత్తన సేకరణ కూడా ఆలస్యంగానే ప్రారంభమైంది. సార్వత్రిక ఎన్నికలుండటంతో అధికార యంత్రాంగం మొత్తం ఆ పనుల్లో ఉన్నారు. అవి ముగియగానే విత్తన పంపిణీపై దృష్టి సారించారు. ఎపి సీడ్స్ ఆధ్వర్యంలో విత్తన సేకరణ ప్రారంభమైంది. శుక్రవారం నుంచి పంపిణీ చేపట్టనున్నారు. ఒకవైపు వర్షాలు కూడా పడుతుండటంతో ఎప్పుడులేనంత డిమాండ్ ఉంటుందని ఆశించినప్పటికీ అనుకున్నంత ఉత్సాహం రైతుల్లో కనిపించడం లేదు. ఇప్పటి వరకు 32,850 క్వింటాల్ల విత్తనకాయలను రైతు భరోసా కేంద్రాల్లో నిలువ ఉంచారు. తక్కినది రాబోయే రోజుల్లో పూర్తి చేసేందుకు ఎపి సీడ్స్ చర్యలు చేపట్టింది.

సబ్సిడీ మొత్తం కాజేయకుండా చర్యలుండేనా .?

గతేడాది ఇదే రకంగా రైతులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో విత్తన సేకరణ సంస్థలకు వరంగామారింది. విత్తన కాయలు కావాలని రిజిస్ట్రేషన్ చేసిన రైతులు తీసుకోని నాన్ సబ్సిడీ మొత్తాన్ని విత్తన సేకరణ యజమానులు కట్టేసి పంపిణీ పూర్తి చేసినట్టు చూపించి సబ్సిడీ మొత్తాన్ని కాజేశారు. ఇది సత్యసాయి జిల్లాలో అత్యధికంగా జరిగింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో దీనిపై అధికారులు విచారణ కూడా చేపట్టారు. పెద్దగా చర్యలేవి లేకుండానే ముగించారు. ఇటువంటి అక్రమాలకు ఈసారి ఏ రకంగా అధికారులు కట్టడి చేస్తారన్నది చూడాల్సి ఉంది. సమయం తక్కువగా ఉండటం, ఎన్నికలు కూడా జరుగుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించకపోతే గతేడాదిలాగానే కొంత మంది సబ్సిడీ మొత్తాన్ని కాజేసే అవకాశాలున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సబ్సిడీపై పంపిణీ చేస్తున్న విత్తన నాణ్యతపైనే అనేక సందేహాలు రైతుల్లో ఉన్నాయి. సర్టిఫైడ్ విత్తనం కాకుండా ఇప్పుడు పంపిణీ చేస్తున్న ట్రూత్‌ఫుల్ లేబుల్డ్ సీడ్. దీనికి జర్మినేషన్ పరీక్షలు జరపాల్సి ఉంది. గతేడాది ఇవి కూడా సక్రమంగా జరగలేదన్న ఆరోపణలున్నాయి. దీనిపైనా అధికారులు ఈసారి తగిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా..!

- ◆ ఇష్టారాజ్యంగా తోడేస్తున్న అధికార పార్టీ నాయకులు
- ◆ భంభం స్వామి దర్గా రోడ్డే రాచబాట
- ◆ రూ. కోట్లు ఆర్జించిన అక్రమార్కులు

ఇసుక ట్రాక్టర్‌కు ఎదురుగా స్కూటర్‌పై వెళ్తున్న పట్టణ విఆర్‌ఓ ఉమేష్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయినా ఇసుక అక్రమ రవాణా కట్టడిలోకి రావడం లేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు నేతలు ఇష్టారీతిన ఇసుకను తోడుస్తున్నారు. రాయదుర్గం మండలం వేపరాల సమీపంలోని రీచ్ వద్ద ఈ నెల 11వ తేదీన ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. రాయదుర్గం పట్టణం నుంచి వేపరాల ఇసుక రీచ్ వద్దకు 23 కిలోమీటర్ల దూరం ఉంది. వేదవతి నది పరివాహక గ్రామాలు పట్టణానికి అతి సమీపంలో 15 కిలోమీటర్ల లోపు ఉండడం ఇసుకాసురులకు కలిసొచ్చింది. ఇదే అదనుగా గుమ్మఘట్ట మండలంలోని భూపసముద్రం, నేత్రపల్లి, రంగచేడు, బేలోడు, కలుగోడు, పరిసర గ్రామాల నుంచి రాయదుర్గం పట్టణానికి యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. వేదవతి, హగరి పరివాహక గ్రామాల నుంచి రాయదుర్గం పట్టణానికి ఇసుకను తరలించడంలో అక్రమార్కులు రాటుదేలారు. రాయదుర్గం నుంచి అనంతపురం-భూపసముద్రం వెళ్లే కూడలి రోడ్డు పట్టణ శివారులోని(74 ఉడేగోళం సమీపంలో) వైఎస్ఆర్ సర్కిల్ ఉంటుంది. ఇక్కడ దాకా వచ్చిన ఇసుక ట్రాక్టర్లు నటరాజ్ కాలనీ, భంభం స్వామి దర్గా గుండా టీచర్స్ కాలనీ, ఎడిసిసి బ్యాంక్ వద్ద ఉన్న కూడలి రోడ్ ద్వారా చేరుకుంటాయి. ఇందుకోసం ఇసుక అక్రమ వ్యాపారం చేసేవారు ద్విచక్ర వాహనాలపై ఎస్కార్ట్‌గా వెళ్లి సెల్ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి పుచ్చుకుంటారు. వైఎస్ఆర్ సర్కిల్ కూడలిలో, ఆర్టీసీ డిపో వద్ద ఉన్న బంకుల దగ్గర వీరి మనుషులు పర్యవేక్షణకు ఉంటారు. రాత్రిపూట 30 నుంచి 40 ట్రిప్పుల దాకా ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నెల 20వ తేదీ కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, కళ్యాణదుర్గం ఆర్‌డిఒ రాణిసుస్మిత, మైనింగ్, సెబ్ అధికారులు వేపరాల రీచ్‌ను సందర్శించారు. ఇసుక తరలింపుపై రాయదుర్గం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్‌డిఒ రాణిసుస్మిత ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అయినా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది.

రాయదుర్గం పట్టణంలోని లక్ష్మీ బజార్ పెట్రోల్ బంక్ వైపు నుంచి కణేకల్లు రోడ్డుకు శుక్రవారం ఎపి 39 డిఇ 4312 నెంబర్ గల ఇసుక ట్రాక్టర్ వచ్చింది. ఆ సమయంలో పట్టణ విఆర్‌ఓ ఉమేష్ స్కూటర్‌పై ఇసుక ట్రాక్టర్‌కు ఎదురుగా వచ్చారు. విఆర్‌ఓ ఇసుక ట్రాక్టర్‌ను చూసినా కనీసం నిలువరించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. ఇసుక రవాణాకు అనుమతులు లేకపోయినా పట్టపగలే ఇసుక తరలిస్తున్నా విఆర్‌ఓ ట్రాక్టర్‌ను చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఇసుక ట్రాక్టర్, విఆర్‌ఓ స్కూటర్‌కు ఎదురెదురు అయినా దానికి గురించి కనీసం పట్టించుకోలేదు. రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణాకు పరోక్షంగా సహకరిస్తున్నారనడానికి ఈ సంఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. సెబ్ అధికారులు మద్యం అక్రమ రవాణాపై మాత్రమే దృష్టి పెట్టి ఇసుక అక్రమ రవాణాపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ ఇసుక రీచ్‌లో తవ్వకాలు ఆగిపోవడంతో అక్రమార్కులు అందినకాడికి దోచుకుంటున్నారు. భవన నిర్మాణాలు చేయిస్తున్నవారు ట్రాక్టర్ ఇసుక రూ.4,500 కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిందిస్థాయి సిబ్బంది ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారికి సహకరిస్తున్నట్లు సమాచారం.

అధికారం మాటున అక్రమ రవాణా

2019లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొందరు అక్రమార్కులు స్థానిక ప్రజాప్రతినిధుల అండతో ఇసుక అక్రమ రవాణా ద్వారా రూ. కోట్లు గడించారని ఆ పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. మోటార్ సైకిల్‌పై గ్రామాల నుంచి రాయదుర్గం రావాలంటే ఖర్చుల కోసం ఆలోచించే పరిస్థితి ఉన్న నాయకులు ఇసుక అక్రమ రవాణాలో రాటుదేలి ప్రస్తుతం సొంతంగా ట్రాక్టర్లు, కార్లు కొనుగోలు చేశారంటే అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో చేశారో తెలుసుకోవచ్చు. 2019 ఎన్నికల సమయంలో ఓ మేస్త్రీ టిడిపికి అనుకూలంగా పనిచేశాడు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిడిపి నాయకుడు ఇసుక అక్రమంగా తరలిస్తున్నాడంటూ సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు పెట్టి మరీ పోలీసులకు పట్టించారు. ఇలాంటి వేధింపులు భరించలేని ఆ మేస్త్రీ అధికార పార్టీలో చేరాడు. దీంతో అప్పటి నుంచి ఆయన అక్రమంగా ఇసుక తరలించినా ఎవరూ అడ్డుచెప్పలేదు. ఇలా ఈ వ్యక్తి ఇసుకను దోపిడీ చేసి రూ.కోట్లు గడించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకులు రీచ్‌లలో ఒక ట్రిప్పు లోడ్ చేసుకుని ఇచ్చిన బిల్లుతో రోజంతా దాన్నే పెట్టుకుని పదుల సంఖ్యలో అక్రమంగా తరలించిన దాఖలాలు ఉన్నాయి. మరికొందరు ఇసుక లోడ్ చేసే ట్రాలీ నెంబర్లు లేకుండా పెయింట్ చేసి మరీ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఓ ప్రజాప్రతినిధి కుటుంబం అండతో రాయదుర్గం, బళ్లారి, బెంగళూరుకు అక్రమంగా ఇసుక తరలిస్తూ ఇసుక మాఫియా రెచ్చిపోతుందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పలుమార్లు విలేకరుల సమావేశంలో ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణా ఇలానే కొనసాగితే రాయదుర్గం చుట్టపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించి దానిని నియంత్రించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

పడకేసిన పారిశుద్ధ్యం..!

తీవ్రమైన దోమల బెడద.. అనారోగ్యం బారిన ప్రజలు

ప్రజాశక్తి-బొమ్మనహల్

మండల పరిధిలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీ కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రమై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రధానంగా మండలంలోని ఉద్దేహాల్, బొమ్మనహాల్, గోవిందవాడ, శ్రీధరఘట్ట గ్రామాల్లో డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేయడకపోవడంతో చెత్తచెదారం పేరుకుపోయింది. దీంతో మురుగునీరు ముందుకు కదలక నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల బెడద తీవ్రమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆయా గ్రామాల్లో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో డ్రెయినేజీ కాలువలు నిండి మురికినీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అయినా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఇకనైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ కాలువల్లో చెత్తచెదారం తీయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఎంపిడిఒను వివరణ కోరగా మా దృష్టికి రాలేదని సమాధానం దాటవేశారు.

హనుమద్ వాహనంపై వెంకటరమణస్వామి

రాయదుర్గం : పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారు సతీ సమేతంగా హనుమద్ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారుప. ముందుగా స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి హనుమత్ వాహనంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, రాయదుర్గం సుగాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఫలితాలపై జోరుగా బెట్టింగ్

నార్పలలో కమీషన్ కేంద్రాలు..!?

చేతులు మారుతున్న లక్షల రూపాయలు

ప్రజాశక్తి-నార్పల

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం ఫలితాలపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారనే దానిపై పెద్ద ఎత్తున చర్చలు నడుస్తున్నాయి. ఈ సమయంలో బెట్టింగ్‌లు కూడా జోరందుకున్నాయి. నార్పల మండలంలో కొందరు కేవలం బెట్టింగ్ కోసమే కమీషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గతంలో నార్పలలో మట్కా, పేకాట, సరిబేసి, క్రికెట్ పందేలు ఎక్కువగా జరిగేవి. కొందరు కేవలం బెట్టింగ్‌లనే పనిగా పెట్టుకుని వ్యాపారాలు చేసిన వారూ ఉన్నారు. బెట్టింగ్‌లో కమీషన్ వ్యాపారిగా ఉంటూ డబ్బును చేయి మార్చి పెద్ద మొత్తంలోనే సంపాదించుకున్నారు. అలాంటి వారిని చూసి ప్రస్తుతం ఎన్నికల ఫలితాల సమయంలో కొందరు బెట్టింగ్ కమీషన్ జూదానికి తెరతీసినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసిన పలు పార్టీల అభ్యర్థుల జయాపజయాలపై మండల వ్యాప్తంగా లక్షలాది రూపాయలు బెట్టింగ్ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. బెట్టింగ్ వేసేవారు ఒకరిపై ఒకరికి నమ్మకం లేక బెట్టింగ్ సొమ్మును కొందరి వద్ద భారీ మొత్తంలో కలిపి ఉంచుతున్నారు. ఇలా డబ్బులు ఉంచుకునే వారు పందెం గెలిచిన వారితో 10 నుంచి 20 శాతం కమీషన్ తీసుకునేలా ఒప్పందం చేసుకుంటున్నారు. అంటే ఒక లక్ష రూపాయలు పందెం వేస్తే కమీషన్ రూపంలో ముందు మాట్లాడుకున్న ఒప్పందం ప్రకారం రూ.10వేలు లేదా రూ.20 వేల వరకు ఆ వ్యక్తికి ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా బెట్టింగ్ జూదరులు పెద్ద మొత్తంలోనే కొందరి వద్ద డబ్బులు ఉంచినట్లు సమాచారం. ఎన్నికల ఫలితాల వెలువడే సమయానికి ఈ బెట్టింగ్ జోరు మరింత పెరిగే అవకాశం మండలంలో కన్పిస్తోంది.

సమాచారం ఇవ్వండి

రాజశేఖర్ ఎస్ఐ, నార్పల

సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ ఆడేవారిపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్ ఆడడం, కమీషన్ రూపంలో డబ్బులు ఉంచుకోవడం చట్ట రిత్యా నేరం. మండలంలో బెట్టింగ్ సొమ్ము కలిపారని సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేసి సహకరించాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవా లని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోరి నాగరాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదేళ్లుగా బొమ్మనహాల్ మండలంలో పంట నష్టపరిహారం కానీ, పంటల బీమా పథకం కానీ అమలు కాలేదని వాపోయారు. కేవలం ఓ వ్యక్తి ఇచ్చిన పత్రికా ప్రకటన మేరకు మండలానికి రావాల్సిన పంట నష్ట పరిహారం, పంటల బీమా ఆగిపోయాయన్నారు. త్వరలో ఏర్పడనున్న నూతన ప్రభుత్వమైనా, ముఖ్య మంత్రి అయినా, రాయదుర్గం ఎమ్మెల్యే అయినా నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నాగరాజు విజ్ఞప్తి చేశారు.

వర్షాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అధికారులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రామాంజనమ్మ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆది, సోమవారం వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండల వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరుగకుండా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పశువులు, మనుషులకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించడానికి అధికారులు అప్రమత్తంగా ఉండాల న్నారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి సాయికుమార్, పిహెచ్‌సి వైద్యాధికారి వెంకట్‌రెడ్డి, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

లేఅవుట్లలో అవినీతిపై విచారణ చేయండి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ, లేఅవుట్ల ఏర్పాటులో అవినీతి, అవకతవకలపై విచారణ జరపాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి, ఆ పార్టీ రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి చిందనూరు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు నాగరాజు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రాయదుర్గం పట్టణంలో బిటి ప్రాజెక్ట్ మోడల్ కాలనీ లేఅవుట్ ఏర్పాటు సమయంలో భూ యజమాని నుంచి అధికార పార్టీ నాయకులు తక్కువ ధరకు పొలాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు ప్రభుత్వానికి విక్రయించారన్నారు. దీనివల్ల రైతు తీవ్రంగా నష్టపోయారని, అతడికి న్యాయం చేయాలని కోరారు. బిటిపి రోడ్డు లేఔట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 1.57కోట్లు వసూలు చేసి భూ యజమానికి రూ. 36 లక్షలు మాత్రమే అందజేశారన్నారు. అవినీతి, అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, భూమి యజమానులకు న్యాయంగా అందాల్సిన పరిహారం అందించాలని నాగరాజు డిమాండ్ చేశారు. అంతేగాక నియోజకవర్గంలో లేఅవుట్ల ఏర్పాటులో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని కోరారు. ఆయనతో పాటు బీఎస్పీ అనంతపురం జిల్లా అధ్యక్షులు నాగభూషణం, తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బిఎస్పీ నాయకుడు చిందనూరు నాగరాజు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమిశాలి

ప్రశాంతంగా కౌంటింగ్‌ను నిర్వహిద్దాం

కలెక్టర్, డా॥వి.వినోద్ కుమార్, ఎస్పీ గౌతమి శాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్‌లో ఎలాంటి హింసాత్మక ఘటనలూ చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమిశాలి తెలియజేశారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ ప్రక్రియపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలను కాపాడాలన్నారు. కౌంటింగ్ శాంతియుతంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమలు అవుతోందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరూ ప్రవర్తించనా చర్యలు తప్పవన్నారు. ఎస్పీ గౌతమి శాలి మాట్లాడుతూ కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వరాదన్నారు. హింస సష్టించినా, సష్టించాలని చూసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ ప్రక్రియ ముఖ్యమైనదని, ఇందుకోసం బందోబస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో 8 మందిని ఇప్పటికే జిల్లా బహిష్కరణ చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో గొడవలు చేసేందుకు ఆస్కారం ఉందని గుర్తించిన వారిని బైండోవర్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కౌంటింగ్ ర్యాండమైజేషన్

కలెక్టరేట్‌లోని ఎన్ఐసి భవనంలో కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ కోసం పారదర్శకంగా కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కోసం 1,354 మంది కౌంటింగ్ పర్సనల్స్‌ని నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి, ఎన్ఐసి డిఐఒ రవిశంకర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందిస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

గుమ్మఘట్ట మండల కేంద్రంలో విత్తన పంపిణీని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర ఎకరాల లోపు ఉన్న రైతులకు 30 కేజీల బ్యాగ్ ఒకటి, అర ఎకరా నుంచి ఎకరా లోపు ఉన్న రైతులకు 30 కేజీల బ్యాగులు రెండు, ఎకరా పైనున్న వారికి మూడు బస్తాల 30 కేజీల వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్ ద్వారా విత్తనాల డబ్బుల చెల్లింపులు చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీకి ఫ్లయింగ్ స్క్వాడ్ నియామకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవో రాణిసుస్మిత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ లక్ష్మీ నాయక్, ఏవో నిర్మల్ కుమార్ పాల్గొన్నారు.

ఉడేగోళంలో విత్తన పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

బొమ్మనహాల్ : మండల వ్యాప్తంగా శుక్రవారం 610 మంది రైతులకు విత్తన వేరుశనగ కాయలను ఆర్‌బికెల ద్వారా పంపిణీ చేసినట్లు ఏఓ సాయికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని నేమకల్లు, ఉంతకల్లు, గోవిందవాడ, కల్లుహోల, కొత్తూరు, ఖానాపురం గ్రామాల రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశామన్నారు. వరి పంట సాగు చేసే రైతులు జీలుగ విత్తనాలు కొనుగోలు చేసి పొలాల్లో చల్లి దమ్ము చేస్తే దిగుబడి బాగా పెరుగుతుందని తెలిపారు. జీలుగ అవసరం ఉన్న రైతులు ఆర్‌బికెలో కొనుగోలు చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం రైతులకు 2,400 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు ఏవో మహేంద్ర తెలిపారు. ఏవో మాట్లాడుతూ రాయదుర్గం మండలానికి 4వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ మంజూరైందన్నారు. మిగిలిన 1600 క్వింటాళ్లను మరో రెండు రోజుల్లో రైతులకు పంపిణీ చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనకాయలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆత్మకూరు

90శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది నుంచి అతివృష్టి, అనావృష్టి వల్ల జిల్లా రైతాంగం పూర్తి అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో అధికంగా మంది రైతులు పంట సాగు చేయాలంటే కష్టసాధ్యమన్నారు. కావున ప్రభుత్వం స్పందించి 90శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాని కోరారు. అలాగే అలసంద, ఆముదం, కంది, పెసలు వంటి విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు రాము, మండల కమిటీ సభ్యులు రామయ్య, ఐద్వామహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు కృష్ణవేణి, కమిటీ సభ్యులు ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

పుట్లూరు : 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన వేరుశనగ కాయలు పంపిణీ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ శ్వేతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ యల్లనూరు మండలంలోని రైతులకు 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన వేరుశనగ కాయలు, కందులు, ఆముదం, జొన్న విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఓబులేసు, రైతుసంఘం మండల కార్యదర్శి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సూరి, రుషింగప్ప, బుజ్జి, నారాయణస్వామి, ప్రహ్లాద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : ఖరీఫ్‌లో పంట సాగు చేసేందుకు 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో రైతుసంఘం ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు మాట్లాడుతూ రైతులకు వేరుశనగ కాయలను 90శాతం సబ్సిడీతో కంది, పెసర, జొన్న, అలసంద విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విత్తన వేరుశెనగ గోడౌన్‌లో కాయల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాగార్జునరెడ్డి, రాయుడు, సువర్ణమ్మ, రమీజా, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల వినతి

ప్రజాశక్తి-వజ్రకరూరు

కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతూ, మానసిక క్షోభకు గురి చేస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ జవహర్‌కుమార్, డిఇ శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మిక యూనియన్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రాఘవేంద్రప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణదుర్గం, రాయదుర్గం పరిధిలో పని చేస్తున్న కార్మికులకు ఇచ్చే జీవితంలో రూ.2,220 కోత విధించడాన్ని నిరసిస్తూ ఈనెల 18న సాయంత్రం స్వచ్ఛందంగా కార్మికులందరూ ఏకమై ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు మోటార్లు రన్నింగ్‌లో ఉన్నప్పుడే అప్పగించినట్లు ఇళ్లకు వెళ్లారన్నారు. అయితే అదేరోజు రాత్రి ఆర్‌డబ్ల్యూఎస్ పంపు ఆపరేటర్ వన్నూరుస్వామి ఇంటి వద్దకు రాత్రి 11 గంటల సమయంలో వెళ్లి వచ్చి మోటార్లు ఆన్ చేసి విధుల్లో చేరాలని, లేనిపక్షంలో విధుల నుంచి తొలగిస్తామని భయాందోళనకు గురి చేయడం బాధాకమరమన్నారు. అదేవిధంగా మరికొంతమంది కార్మికులను ఇళ్లకు వెళ్లి బెదిరించారన్నారు. అడ్డొచ్చిన మహిళలను సైతం చెప్పరాని మాటలతో దుర్భాషలాడారని వాపోయారు. అలాగే పిఎబిఆర్ డ్యామ్‌లో విధులు నిర్వహిస్తున్న హెల్పర్ హరీష్ తనకు రావాల్సిన జీతం ఇవ్వాలని కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డిని అడగడంతో తననే జీతం అడుగుతావా అంటూ భౌతిక దాడులకు దిగాడన్నారు. దీంతో కార్మికులందరూ కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారన్నారు. చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్మికులను కక్ష సాధింపులకు పాల్పడుతున్న కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, శ్రీరామిరెడ్డి కార్మిక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐ, సిఐలకు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు

రాకెట్ల నారాయణరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-వజ్రకరూరు

పేదల పక్షపాతిగా.. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా కామ్రేడ్ రాకెట్ల నారాయణరెడ్డి నిలిచిపోయారని పలువురు వక్తలు కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ నారాయణరెడ్డి వర్థంతిని పురస్కరించుకుని రాకెట్లలోని రాకెట్ల నారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి సమాధుల వద్ద సిపిఐ నాయకులతోపాటు నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం ఉరవకొండ సిపిఐ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రంగారెడ్డి, సిపిఐ నాయకులు మల్లికార్జున, మనోహర్, నారాయణరెడ్డి కుమారుడు మధుసూదన్‌రెడ్డి, మనవడు నిఖిల్‌నాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నివాళి

తన తండ్రి, కమ్యూనిస్టు నాయకులు రాకెట్ల నారాయణరెడ్డి, సోదరుడు రవీంద్రనాథ్‌రెడ్డి వర్థంతిని పురస్కరించుకుని అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్వగృహంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

10వ రోజుకు వేసవి శిబిరం

వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లాకేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం 10వ రోజుకు చేరుకుంది. సంస్థ కార్యదర్శి రమా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు పిల్లలు పెద్దఎత్తున తరలివచ్చి ప్రతిభను కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా యోగా, డ్రాయింగ్, కథలు, పద్యాలు చెప్పడం, పుస్తక పఠనం, డ్యాన్స్ వంటి విభాగాల్లో పిల్లలు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో సహాయ గ్రంథాలయ అధికారి ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, నాగమణి, ఉజ్జినేస్వారి, రిసోర్స్ పర్సన్లు వెంకటేషప్ప, రమేష్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడొద్దు : సిఐ

గుత్తి : ఎన్నికల ఫలితాల రోజు ప్రజలు ఎవరూ అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని తహశీల్దార్ బి.భారతి, సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ బి.నబిరసూల్ సూచించారు. శుక్రవారం మండలంలోని తొండపాడు గ్రామంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చేనెల 4న కౌంటింగ్ సందర్భంగా ఎవరూ అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ముందుగా సిఐ, ఎస్ఐలు పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం కాలనీలోని పలు ఇళ్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హనుమంతు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

నడిమిదొడ్డిలో కార్డెన్‌సెర్చ్

నార్పల : ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు శింగనమల సిఐ శ్రీధర్, నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నడిమిదొడ్డి గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా ట్రబుల్ మాంగర్స్, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అంతేకాకుండా పశువుల పాకలు, గడ్డివాములు, దొడ్లు తదితర ప్రదేశాలను జల్లెడపట్టారు. తర్వాత రికార్డులు లేని 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రధాన రహదారి, కాలనీల్లో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు.

విత్తన వేరుశనగ పంపిణీ

ఎ.నారాయణపురంలో విత్తనకాయలను పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి సూచించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఎ.నారాయణపురం ఆర్‌బికె సెంటర్‌లో విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు తమ ఆర్‌బికెల పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకుని సబ్సిడీ వేరుశనగను తీసుకోవాలన్నారు. తొలకరి వర్షాలు కూడా పడిన నేపథ్యంలో విత్తన కాయలను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఉప్పరపల్లి ఆర్‌బికెలో కూడా విత్తనకాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారి బి.మురళీకృష్ణ, అలేఖ్య, ఆర్‌బికె సిబ్బంది నాగలత, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని పలు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకున్న 1472 మంది రైతులకు శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ గోడౌన్లలో 1375 క్వింటాళ్ల వేరుశనగ కాయలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి తెలిపారు.

బుక్కరాయసముద్రం : మండలవ్యాప్తంగా 936 మంది రైతులకు శుక్రవారం 794.4 క్వింటాళ్ల కదిరి-6 విత్తనం పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. రైతులు విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వజ్రకరూరు : ఉరవకొండ డివిజన్ పరిధిలోని విడపనకల్, ఉరవకొండ, వజ్రకరూరు మండలాలవ్యాప్తంగా విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేసినట్లు ఎడిఎ పద్మజ తెలిపారు. ఇందులో భాగంగా ఉరవకొండ, విడపనకల్ మండలాల వ్యవసాయ అధికారులు శుభకర్, పెన్నయ్య విత్తన పంపిణీని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో విత్తన వేరుశనగ పంపిణీని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 3015 మంది రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకున్నారని, వారందరికీ నాణ్యమైన విత్తన కాయలను అందజేస్తామన్నారు.

శింగనమల : మండల వ్యాప్తంగా మొదటి విడత రిజిస్టర్ చేసుకున్న 400 మంది రైతులకు 360 క్వింటాళ్ల విత్తన పంపిణీ చేసినట్లు ఎఒ అన్వేష్‌కుమార్ తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులకు నేడు, రేపు కూడా విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బెలుగుప్ప : మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా శుక్రవారం విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేసినట్లు ఎఒ పృథ్వీసాగర్ తెలిపారు. మండల వ్యాప్తంగా 399 రైతులు పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. రైతులకు క్రమ పద్ధతిలో విత్తన పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒలు నాగమణి, శిల్పా, తిమ్మారెడ్డి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పట్టణ ప్రజలకు మూడు రోజులకు ఒకసారి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రెండు రిజర్వాయర్లలో నీరు సమృద్ధిగా ఉందన్నారు. అయితే స్టోరేజ్ ట్యాంకులను శుద్ధి చేయకపోవడంతో నీరు పచ్చ రంగుగా మారి దుర్వాసన వస్తోందన్నారు. అనేక వార్డుల్లో పైపులైన్ల లీకేజీల కారణంగా కలుషిత నీరు సరఫరా అవుతోందన్నారు. వెంటనే మరమ్మతులు చేసి మూడు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేయాలన్నారు. రిజర్వాయర్ దగ్గర ఫిల్టరింగ్, పంపింగ్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. అనేక వార్డుల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. రంగు నీరు తాగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటిని పరిశుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని.. నీరు శుద్ధి చేయడానికి కాంట్రాక్టర్‌కు పనులు ఇచ్చేందుకు వీలుకాదని పొంతన లేని సమాధానాలు చెప్పడంతో సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్యం కన్నా ఎన్నికల కోడ్ ముఖ్యమా.. అంటూ నిలదీశారు. వెంటనే పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డిఇఇ సెట్‌కు 300 మంది హాజరు : డిఇఒ

అనంతపురం సిటీ : నగరంలో శుక్రవారం నిర్వహించిన డిఇఇ సెట్-2024 పరీక్షకు 300 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తెలిపారు. 343 అభ్యర్థులకుగాను 300 మంది హాజరుకాగా 43 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ప్రభుత్వ పరీక్ష కమిషనర్ హెచ్.గోవిందనాయక్ పర్యవేక్షించినట్లు తెలిపారు.

టపాసులు విక్రయిస్తే చర్యలు

కుందుర్పి : దుకాణాల్లో టపాసులు, పెట్రోల్ బంకుల్లో బాటిళ్లకు పెట్రోల్ పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ హనుమంతు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు వచ్చేనెల 6వ తేదీ వరకూ 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ దుకాణాల్లో పెట్రోలు, టపాసులు అమ్మకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనంత ఆణిముత్యం 'సత్య అకాడమీ'

ఐఐటి, ఎన్ఐటి, నీట్ ప్రధాన లక్ష్యం : వ్యవస్థాపకులు కాంతిదీప్

ప్రజాశక్తి -అనంతపురం

సత్య అకాడమీ వ్యవస్థాపకులు కాంతిదీప్

అనంత విద్యారంగంలో ఐఐటి, ఎన్ఐటి, నీట్‌లో మన విద్యార్థులు ఉండాలనే గట్టి సంకల్పంతో సత్య అకాడమీని ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకులు ఎం.కాంతిదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ చదవుపై ఉన్న మక్కువతో అనంతపురంలో సత్య అకాడమీని స్థాపించామన్నారు. సుదూర ప్రాంతాలకు విద్యార్థులు పరుగులు పెట్టకుండా అనంతపురంలో సాధారణ స్థాయిలో ఉన్నతమైన లక్ష్యాల దరి చేరేలే విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తమ సోదరులు ఆరుద్ర, విద్యారూప్ నిరంతరం సంస్థ పురోగతికి కృషి చేస్తున్నారన్నారు. 30ఏళ్లుగా పలు విద్యాసంస్థల్లో విద్యార్థులను తీర్చిదిద్దిన తాము.. సత్య అకాడమీని ఏర్పాటు చేసి విద్యలో పోటీ ప్రపంచాన్ని తట్టుకునే ఆణిముత్యాలను తయారు చేస్తున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు 2019 మార్చి 1న సత్య అకాడమీని స్థాపించినట్లు చెప్పారు. మొదట 27 మంది విద్యార్థులతో ప్రారంభమై ఇప్పుడు ప్రతి బ్యాచ్‌కు 40 మంది పరిమిత విద్యార్థులతో మెరుగైన ఫలితాలు సాధించి ఖ్యాతి పొందినట్లు వివరించారు. కాంపిటిటీవ్ పరీక్షల్లో ఎన్ఐటి, నీట్ మెయిన్స్, ఎంసెట్ ఫలితాల్లో రాష్ట్ర, జిల్లాస్థాయి ర్యాంకులతో రాణిస్తున్నట్లు చెప్పారు. 8, 9, 10 తరగతుల నుంచే ఐఐటి స్థాయి ప్రణాలికలతో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇంటర్‌లో ఐఐటి- జెఇఇ (మెయిన్స్,అడ్వాన్స్), ఎన్ఐటి, నీట్ (ఎంపిసి,బైపిసి) లాంగ్ టర్మ్‌లలో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. సాధారణ, మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన తాము లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2019-20లో ఎన్ఐటి మెయిన్స్‌లో రెండు ర్యాంకులను సాధించామన్నారు. ఇదేక్రమంలో ఎంసెట్‌లో వెయ్యిలోపు 13 ర్యాంకులు వచ్చాయన్నారు. 2020-21లో ఎన్ఐటిలో 4, ఎంసెట్‌లో 11, 2021-22లో ఆలిండియా ఐఐటి అడ్వాన్స్‌లో 1355 ఎం.చరణ్‌తేజ్ రాష్ట్ర స్థాయిలో రాణించినట్లు చెప్పారు. ఎంసెట్‌లో వెయ్యిలోపు 11 ర్యాంకులు సాధించినట్లు వివరించారు. 2022-23లో ఆలిండియా ఐఐటిలో గౌతం సాయి, శివహార్తిక్ 348, 3913 ర్యాంకులతో రాష్ట్రస్థాయిలో రాణించినట్లు చెప్పారు. ఎంసెట్‌లో వెయ్యిలోపు 7, వందలోపు 3 ర్యాంకులు వచ్చాయన్నారు. 2023-24లో ఎన్ఐటి మెయిన్స్‌లో 8 మంది అడ్వాన్స్ రాస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో తమ వద్ద ఈ విద్యా సంవత్సరం జూనియర్ సీనియర్ ఇంటర్‌లో 470 మార్కులకు అమిత్ సత్యా 463 మార్కులతో అనంతపురం మూడవ స్థానంలో నిలిచారన్నారు. సీనియర్ ఇంటర్‌లో చంద్రవేదిక 958 మార్కులు సాధించిందన్నారు. భవిష్యత్తులోను తాము ఐఐటి, ఎన్ఐటి, నీట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

అకాడమీలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు

'పివికెకె'కు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

ప్రజాశక్తి-అనంతపురం

పివికెకె కళాశాల

16ఏళ్లుగా జిల్లాలో ఎంతోమంది విద్యార్థులను అతున్నత ప్రమాణాలతో విద్యావంతులుగా తీర్చిదిద్దిన పివికెకె ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ కమిటీ ఏ గ్రేడ్ గుర్తింపు లభించింది. దేశంలోని ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలను పెంపొందించడానికి ఏర్పాటు చేసినస యుజిసి న్యాక్ బృందం గతంలో పివికెకె కళాశాలను సందర్శించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కమిటీ నిపుణులు విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యంతో సంభాషించి అందరి అభిప్రాయాలను తీసుకుంది. అంతేగాకుండా కళాశాలలో విద్య, వసతులు, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, అమలు, విద్యాబోధన స్థాయి, పరిశోధన దిశగా పురోగతి, మౌలిక సదుపాయాలు, విద్యార్థి పురోగతి, కళాశాల విశ్వసనీయత, అత్యున్నత ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నత విద్యార్హతలు కలిగిన ఆచార్యుల నిష్పత్తి తదితర పలు అంశాలను పరిశీలించి పివికెకె కళాశాలకు ఏ గ్రేడ్ కళాశాలగా గుర్తింపు ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్ మట్లాడుతూ అతిత్వరలో పివికెకె ఐటీ అటానమస్ కళాశాలగా గుర్తింపు పొందుతోందని తెలిపారు.

హీమోఫీలియాపై అవగాహన తప్పనిసరి

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మాణిక్యరావు

ప్రజాశక్తి-అనంతపురం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు

'హీమోఫీలియా' (రక్త స్రావ కారకం)పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రభుత్వ మెడికల్ కళాఆల ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు సూచించారు. అనంతపురం హీమోఫీలియా సొసైటీ కార్యదర్శి కృష్ణమూర్తి, రోచ్ కార్యదర్శి డాక్టర్ ఉపేంద్ర కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలోని సుశ్రుత హాల్లో 'హీమోఫీలియా'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ ఇఎస్ఐ ఆసుపత్రి హెమటాలజిస్ట్ డాక్టర్ విక్రమ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హిమోఫిలియా వ్యాధి లక్షణాలు, నివారణ, నిర్థారణ పరీక్షలు, పరిశోధనలను వివరించారు. అనంతరం మాణిక్యరావు మాట్లాడుతూ రక్తం గడ్డ కట్టడంలో సహాయం పడే రక్త పలికల కారకాలు జన్యుపరంగా, అనువంశికంగా లోపించడం వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. త్వరితగతిన దీన్ని గుర్తించి, ప్లేట్‌లేట్ కారకాలను శరీరంలోకి పంపిస్తే వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ స్పీకర్ డాక్టర్ విక్రమ్‌కుమార్, అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, విశ్రాంత సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ జగన్నాథ్, టీబి, చెస్ట్ ప్రధాన విభాగాధిపతి రామస్వామి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, వైస్ ప్రిన్సిపాళ్లు నవీన్, శంషాద్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వందేళ్ల వేపచెట్టు

పుట్లూరు : మండలంలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు మండలంలోని కందికాపుల గ్రామంలో ఉన్న రచ్చకట్ట వంద నూరేళ్ల పైబడిన వేపచెట్టు నేలకొరిగింది. అయితే ఆ సమయంలో చెట్టు కింద ఎవరూ లేకపోవడంతో ప్రాణాప్రాయం తప్పింది. కానీ విద్యుత్ వైర్లు తెగిపోయాయి. కరెంటు లేకపోవడంతో ఏ ప్రమాదం చోటు చేసుకోలేదు.

హంస వాహనంపై ఊరేగిన నారసింహుడు

స్వామివారిని ఊరేస్తున్న అర్చకులు, భక్తులు

వజ్రకరూరు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెన్నఅహోబిలం లక్ష్మీ నరసింహస్వామి శుక్రవారం హంస వాహనంపై ఊరేగారు. ఇందులో భాగంగా వేకువజామున మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు, అర్చనలు, మంగళ హారతులను నిర్వహించారు. అనంతరం అందంగా అలంకరించిన హంస వాహనంపై ఉత్సవమూర్తులను ఆసీనులను చేసి ఊరేగించారు. హంస అంటే జ్ఞానానికి ప్రతీకగా పేర్కొంటారు. హంసలో ఉన్న ప్రత్యేక లక్షణం ఏంటంటే.. నీళ్లను, పాలను వేరుచేసే స్వభావంతో ఇది ప్రత్యేకంగా నిలిస్తుంది. భక్తుల్లో నెలకొన్న అహంభావాన్ని తొలగించి జ్ఞానసిద్ధి, బ్రహ్మపద ప్రాప్తి ప్రసాదించేందుకు స్వామి వారు హంస వాహనంపై కనిపిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్, బాలాజీస్వామి, గుండురావు, ఉత్సవదాతలు, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు : వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా సహాయ అధికారి సత్యనారాయణ సూచించారు. శుక్రవారం ఉరవకొండలోని పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రిలో సంబంధిత సిబ్బందికి సీజనల్ వ్యాధులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాధికారులు ఎల్లోజీ, గంగాధర్, ఉరవకొండ మలేరియా సబ్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్, వైద్య, సచివాలయ సిబ్బంది, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో జాగ్రత్తగా ఉందాం...

అనంతపురం కార్పొరేషన్ : వాతావరణ శాఖ ముందస్తు సమాచారం మేరకు రాబోయే మూడు, నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురవడంతోపాటు పిడుగులు పడే సూచన ఉన్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ మేఘ స్వరూప్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. కావున లోతట్టు ప్రాంతాల ప్రజలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉన్న ప్రజలకు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. అలాగే చెట్ల కింద ఉండరాదన్నారు. నగరవాసులు సహాయ చర్యల నిమిత్తం నగరపాలక సంస్థ హెల్ప్‌లైన్ కేంద్రం 08554-274765, 230234 సంప్రదించాలని కోరారు.

వీరపెద్దన్నస్వామి ఉత్సవాలు ప్రారంభం

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామంలో వీరపెద్దన్న స్వామి ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వీరపెద్దన్న స్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ పూలమాలలు, దుస్తులతో ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో స్వామివారి నృత్యాలు అందరినీ అలరించాయి.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

వజ్రకరూరు : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జడ్పిటిసి హనుమంతు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి కరణం పుష్పావతి అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన పలు అంశాలను అజెండాలో పొందుపరిచి, సమస్యలు పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కొండయ్య, అడ్మినిస్ట్రేషన్ అధికారి భాస్కర్, వైస్ఎంపిపి రాకెట్ల పుష్పావతి భీమరావు, సొసైటీ ఛైర్మన్ శ్రీరాములు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికలకు చదువు తప్పనిసరి

అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి

శింగనమల : కిశోర బాలికలను తప్పనిసరిగా చదించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సి.బండమీదపల్లి గ్రామంలో కిషోర బాలికల మాసిక మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు మంచి సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. నెలసరి సమయంలో మంచి శక్తినిచ్చే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయకూడదన్నారు. ఒకవేళ బాల్యవివాహాలు చేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించడకుండా ప్రతి బాలికనూ తప్పనిసరిగా చదివించాలన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయాలు మసూదమ్మ, నాగ ప్రశాంతి, మస్తాన్‌బి, రజినీ, కిశోర బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వృద్ధుడు ఆత్మహత్య

గుత్తి : మండలంలోని జక్కలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ కానిస్టేబుళ్లు వాసు, నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 65 ఏళ్ల వృద్ధుడు రైల్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్ల అంగి, పంచ వృద్ధుడు ధరించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించామని వెల్లడించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

గుత్తి : స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. రైలు ప్రయాణికులు కింద పడేసిన ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించి విక్రయించుకునే వృద్ధుడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే జీఆర్పీ కానిస్టేబుళ్లు వాసు, నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సబిహా ట్రేడర్స్‌లో చోరీ

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న సబిహా స్టీల్ అండ్ ఐరన్ ట్రేడర్స్ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. దొంగ దుకాణం వద్ద నిద్రించినట్లు నటించి ఇనుప రాడ్డుతో షట్టర్‌కు ఉన్న తాళాలను తొలగించాడు. లోనికి ప్రవేశించి అందులో ఉన్న రూ.12 వేలు నగదు, సెల్ ఫోన్ దోచుకుని వెళ్లాడు. ఈ చోరీ దృశ్యాలన్నీ సీసీ ఫుటేజీలో రికార్డయ్యాయి. ఉదయం షాపునకు వచ్చిన యజమాని మైను గమనించగా తాళాలు ఓపెన్ చేసి ఉండటంతో ఒక్కసారిగా ఖంగుతున్నాడు. లాకర్‌లో ఉన్న డబ్బు లేకపోవడంతో చోరీ జరిగినట్టు భావించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ బి.నబిరసూల్ ఘటనా స్థలాన్ని పరిశీలించి సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు.